## వెళ్లొస్తాం మల్లన్నా..

### ముగిసిన వేలాల, కత్తెరశాల జాతరలు



వేలాల నుంచి తిరిగి వెళ్తున్న భక్తులు

జైపూర్, మార్చి 10 : మహాశివరాత్రిని పురస్కరించుకుని వేలాలలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతర ఆదివారంతో ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి పట్నాలు వేసి.. బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. పారిశుధ్య పనులపై ఎంపీడీవో గడ్డం సత్యనారాయణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

**చెన్నూర్ రూరల్, మార్చి 10 :** కత్తెరశాల గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఆదివారం ముగిసింది. భక్తులు బోనాలు పోసి తీపి పదార్థాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పట్నాలు వేసి.. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చెన్నూర్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, ఆనాటి గురువులు

రామకృష్ణాపూర్, మార్చి 10 : రామకృష్ణాపూర్‌లోని జడ్పీ బాలుర పాఠశాలలో 1992-1993 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 150 మంది ఒకేచోట చేరి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయమందిస్తామని తెలిపారు. గురువులు నారాయణ రావు, వామనమూర్తి, రాజేశ్వర్‌రావు, చంద్రమౌళి, వీర శంకర్, జగన్, చంద్రసుశీల, రోజ్‌మేరీ, మధురాబాయి, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు.

# గడ్డం వంశీకి టికెట్ లేనట్టేనా?

### కాంగ్రెస్‌లో పెరిగిన గ్రూప్ రాజకీయాలు

- సుగుణ కుమారికి ఎంపీ టికెట్ ఇవ్వాలంటున్న మంత్రి శ్రీధర్‌బాబు
- ఎమ్మెల్యేలతో ఢిల్లీకి వెళ్లి మరీ లాబీయింగ్
- తొలి జాబితాలో పెద్దపల్లి అభ్యర్థిని ప్రకటించకపోవడంపై అనుమానాలు



మంచిర్యాల, మార్చి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి ఎంపీ టికెట్ గడ్డం వంశీకే వస్తున్నదని పెట్టుకున్న ఆశలన్నీ గల్లంతయ్యేలా కనిపిస్తున్నాయి. గడ్డం వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌లో చేరే ముందే పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆయన కొడుకు వంశీకి ఇస్తామని అధిష్టానం నుంచి కమిట్‌మెంట్ వచ్చినట్లు చెప్పారు. రేపో, మాపో ఎన్నికల నగారా మోగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. దీంతో గడ్డం ఫ్యామిలీ అయోమయంలో పడింది. మాజీ ఎంపీ సుగుణ కుమారికి టికెట్ ఇప్పించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలను ఢిల్లీకి తీసుకువెళ్లి అధిష్టానంతో మంతనాలు చేసినట్లు సమాచారం. వాస్తవానికి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలైన చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు తప్ప ఎవ్వరు కూడా వంశీకి సపోర్ట్ చేయడం లేదని తెలిసింది. టికెట్‌పై రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం నుంచి కమిట్‌మెంట్ ఉన్నదని చెప్పుకుంటున్న గడ్డం సోదరులు, ఇప్పటికే వంశీని ఎంపీ అభ్యర్థిగా ఎస్టాబ్లిష్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గడ్డం వెంకటస్వామి(కాక) పేరుపై ఇటీవలే పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా క్రికెట్ లీగ్‌ను నిర్వహించారు. లక్షల రూపాయల ప్రైజ్‌మనీగా యూత్‌లో గుర్తింపు పొందాలని చూశారు. కానీ.. ఉన్నఫలంగా తెరపైకి కొత్త వ్యక్తి పేరు రావడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితులు నెలకున్నాయి.

#### తొలి జాబితాలో ఎందుకు లేనట్లు..

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తొలి ఎంపీ అభ్యర్థుల జాబితాలో పెద్దపల్లి లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గడ్డం వంశీకి టికెట్ ఇస్తామనే హామీ ఉన్నప్పుడు ఫస్ట్ లిస్ట్‌లోనే పేరు వచ్చేది కదా? అందులో పేరు లేదంటే వేరే వారికి టికెట్ ఇచ్చే అవకాశాలు కూడా లేకపోలేదని పలువురు చర్చించుకుంటున్నారు. పెద్దాయన గడ్డం వెంకటస్వామిని చూసి వీళ్లని భరించడం తప్ప ఎంపీగా వివేక్ ఉన్నప్పుడు ఒరగబెట్టింది ఏం లేదనే అభిప్రాయం జనంలో బలంగా ఉంది. మరోవైపు ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతకాని కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వర్గం కూడా టికెట్ మాకే ఇస్తారంటూ ప్రచారం చేసుకుంటున్నది. అలాగే.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, రామిండ్ల రాధిక కూడా మాకే టికెట్ వస్తున్నదనే ధీమాతో ఉన్నారు. ఇలా ఎవరికీ వారు పెద్దపల్లి ఎంపీగా పోటీ చేద్దామని చూస్తున్నారు. దీంతో వంశీకి అడ్డంకులు ఎక్కువైపోయాయి. కాగా.. గడ్డం వివేక్ ఎమ్మెల్యేలను ఎవ్వరిని పట్టించుకోకపోవడం కూడా వారంతా వేరే వాళ్లపైపు మొగ్గు చూపేందుకు కారణమైనట్లు తెలుస్తున్నది. వంశీ ఎంపీగా గెలిస్తే రాజకీయంగా తనకు ఇబ్బందులు ఎక్కువైపోతాయని మంత్రి శ్రీధర్‌బాబు భావిస్తున్నట్లు సమాచారం. అలాగే మంత్రి పదవి విషయంలో ఏర్పడిన బేధాభిప్రాయాలు వివేక్ సోదరుడైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సపోర్ట్ చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇలా పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరూ గడ్డం వంశీకి వ్యతిరేకంగా ఉండడంతో ఎంపీ టికెట్ అవకాశాలు దాదాపు చేయిజారిపోయినట్లననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధిష్టానం ఎమ్మెల్యేల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటే వంశీ ఎంపీ టికెట్ ఆశలు గల్లంతవడం ఖాయంగా కనిపిస్తున్నది.

# రేషన్ దందా వీరప్పన్

### మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జోరుగా వ్యాపారం

- సిరోంచ కేంద్రంగా కోట్లు కొల్లగొడుతున్న వీరన్న ● ఆ పేరు చెబితేనే అధికారుల్లో వణుకు
- ముడుపులిచ్చి పని చేయించుకోవడంలో సిద్ధహస్తుడు ● కాదని ఎవరైనా బెట్టు చేస్తే ఇక అంతే..



సిరోంచ గ్రామంలో నేషనల్ హైవే -63 పక్కనే ఉన్న రేషన్ దందా వీరన్న స్థావరం (ఇక్కడే రేషన్ బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతుంది)






మార్చి 7 : ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ దందా వీరన్న

మంచిర్యాల, మార్చి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వీరప్పన్ ఎవరో తెలుసు.. కానీ ఈ సిరోంచ వీరప్పన్ ఎవరనుకుంటున్నారా..? స్మగ్లర్ వీరప్పన్ లాగే.. ఇక్కడ రేషన్ దందాలో వీరన్న కూడా అంతే ఫేమస్. అటు మహారాష్ట్ర, ఇటు తెలంగాణ రాష్ట్రాల్లోని సగం జిల్లాలను శాశించే ఈ మాఫియా డాన్ పేరు చెబితే చాలు అధికారులకు వణుకు పుడుతుందట. వ్యవస్థను చేతుల్లో పెట్టుకొని ఆడించడంలో సిద్ధహస్తుడని అధికారులే చెబుతుండడం గమనార్హం. ఉన్నత స్థాయి అధికారులు మొదలు.. కిందిస్థాయి సిబ్బంది దాకా మామూళ్లు ముట్టజెప్పి పనులు చేయించుకోవడం.. కాదని బెట్టు చేస్తే చేయాల్సింది చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని అంటుంటారు.

#### దందా ఎలా చేస్తారు..

రేషన్ దందాలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను ఏకచత్రాధిపత్యంగా ఏలుతున్న వీరన్న(రేషన్ దందా వీరప్పన్ అని పిలుస్తుంటారు)కు ఏ నెల బియ్యం.. ఏ జిల్లాకు ఎంత అలాటయ్యిందో రాష్ట్రస్థాయి నుంచి ముందే తెలుస్తుందట. అందులో మన వ్యాపారానికి ఎంత వస్తుందనే ఎస్టిమేషన్ కూడా ఆయన ముందే సిద్ధం చేసుకుంటారని తెలిసింది. రేషన్ డీలర్లతో నేరుగా ఒప్పందం చేసుకుంటారట. రేషన్ కోసం వచ్చే లబ్ధిదారులకు సదరు డీలర్లు కిలోకు రూ.15 ఇచ్చి కొనుగోలు చేసి, వీరన్నకు రూ.22కి అమ్ముకుంటారు. అదే రేషన్ డీలర్ కాకుండా బయట కొనుగోలు చేసే ప్రైవేటువాళ్లు రూ.18కి కిలో చొప్పున కొనుగోలు చేసి అదే వీరన్నకు రూ.22కు అమ్ముకుంటారు. ఇలా ఒక మంచిర్యాల జిల్లా నుంచే ప్రతి రోజూ మూడు లారీలు లేదా నాలుగు నుంచి ఐదు డీసీఎం వ్యాన్‌ల బియ్యం తరలిపోతుంటుంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి ఇలాగే లోడ్‌లు వస్తాయి. సిరోంచ గ్రామంలో ఎన్‌హెచ్-63కి పక్కనే ఉన్న వీరన్న గోదాంకు వెళ్తాయి. అక్కడ ఎప్పుడు చూసినా లారీలు, డీసీఎం వ్యాన్‌లు, చిన్న చిన్న ఆటోలు వచ్చి లోడింగ్.. అన్‌లోడింగ్ చేస్తూను ఉంటాయి. ఇక్కడి నుంచి ఈ బియ్యం మహారాష్ట్ర మార్కెట్‌లోకి వెళ్తుంది. రోజూ చిన్న చిన్న వాహనాల్లో గల్లీలన్నీ తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేశాక.. రాత్రికి వాటన్నింటిని లారీలు, డీసీఎం వ్యాన్‌లలోకి ఎక్కిస్తారు. రాత్రికిరాత్రే అవి తెలంగాణ దాటుకొని కోటపల్లి మండలం ప్రాణహిత మీదుగా పక్కనే ఉన్న సిరోంచకు వెళ్లిపోతాయి.

#### అధికారులను మేనేజ్ చేయడం..

ఈ దందా ఎన్ని జిల్లాల్లో నడుస్తుందో అన్ని జిల్లాల్లో కింది స్థాయి అధికారి నుంచి పైస్థాయి వరకు అధికారులకు ముడుపులు ముడుతాయి. నెల జీతమైన లేట్ అవుతుందేమో కానీ.. వీరన్న మామూళ్లు మాత్రం టైమ్‌కు వస్తాయి. అందుకే రేషన్ బియ్యం కండ్ల ముందే తరలిపోతున్నా అధికారులకు కనిపించదు. ఇక రేషన్ దందాను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించే సివిల్ సప్లయ్ అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు ముడతాయని తెలుస్తున్నది. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడో, ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడో పట్టుకోక తప్పని సరి పరిస్థితి వస్తే తప్ప అధికారులు ఆ రేషన్ బియ్యం దోచుకుపోయే వాహనాలను పట్టుకోరు. ఏం చేసినా తప్పదనుకున్నప్పుడు డీసీఎంలు, లారీలు, బొలెరోలను వదిలేసి చిన్నచిన్న ఆటోలను పట్టుకుంటారు. ఆ ఆటోల మీద కేసులు పెడతారు. కోసమెరుపు ఏమిటంటే ఇలా పట్టుకున్న ఆటోలను కూడా చివరకు వీరన్నే విడిపిస్తాడు. ఇలా అన్ని పక్కా ప్లానింగ్ ప్రకారం.. ఎవరికీ అనుమానం రాకుండా జరిగిపోయాయి. మంచిర్యాల జిల్లాలోనైతే రెవెన్యూ శాఖలో ఓ ఉన్నతాధికారికి ప్రతి నెలా రూ.2 లక్షలు, సివిల్ సప్లయ్ శాఖలో రూ. లక్ష ముడుతుందనే టాక్ ఉంది. ఇక రెవెన్యూశాఖ మండలాధికారులకు నెలకు రూ.30 వేలు, పోలీసులకైతే రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అందుతాయని విశ్వసనీయ సమాచారం. ఇదే తరహాలో మిగిలిన జిల్లాల అధికారులకు సైతం మామూళ్లు అందజేస్తారని వీరన్న అనుచరులే చెప్తున్నారు.

#### సిరోంచకు సాఫీగా వాహనాలు వెళ్లేలా..

రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వాహనం బయల్దేరగానే దాని పరిధిలోని సివిల్ సప్లయ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు బండి నంబర్ సమాచారం అందిస్తారు. ఇక ఆ బండి సాఫీగా సిరోంచ వెళ్లేలా మనోళ్లు సహకరిస్తారు. కాకపోతే టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారుల భయానికి రేషన్ బియ్యం తరలించే వాహనం ముందు ఒక ఎస్కార్ట్‌లా టూ వీలర్ వెళ్తుంది. ఎక్కడైనా అధికారులు ఉన్నారా.. ఎవరైనా ఆపుతున్నారా.. అని చూసుకుంటే అలాంటివి ఏమైనా ఉంటే వెంటనే వాహన డ్రైవర్‌కు సమాచారం ఇస్తారు. అధికారి ముందు తనిఖీ చేస్తున్నాడని తెలిస్తే చాలు వాహనం వేరే రూట్ తీసుకొని వెళ్లడమో లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లే వరకు ఎక్కడైనా సేఫ్ ప్లేస్‌లో ఆగి వెళ్లడమో జరుగుతుంటుంది. రేషన్ అక్రమ రావాణా చేసే వాహనాలను పట్టుకున్నారంటే అది ఏ టాస్క్‌ఫోర్స్ అధికారులో, విజిలెన్స్ అధికారులో పట్టుకుంటారు తప్పితే జిల్లాస్థాయి అధికారులు పట్టుకోరు. ఇంత పకడ్బందీగా రేషన్ అక్రమ దందా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. పైగా ఇలాంటి వ్యక్తిని ఇటీవల చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కలవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ఈ అక్రమ రేషన్ దందాపై దృష్టిసారించాలని, ఇందులో భాగస్వాములైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందిస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# గొర్రెలిచ్చేనా..?!

- ప్రశ్నార్థకంగా పథకం కొనసాగింపు ● కోటి ఆశలతో ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- కట్టిన డీడీ డబ్బులిస్తారా.. లేక గొర్రెలు పంపిణీ చేస్తారా.. అన్నదానిపై స్పష్టత కరువు



కేసీఆర్ ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలతో వృద్ధుడు (ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): గొల్ల కుర్మలకు జీవనాధారమైన 'గొర్రెల పంపిణీ' ప్రశ్నార్థకంగా మారింది. రెండో విడత కోసం 562 మంది డీడీలు కట్టి కోటి ఆశలతో ఎదురుచూస్తుండగా, డబ్బులు తిరిగి ఇస్తారా.. లేక గొర్రెలు అందిస్తారా అన్నదానిపై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. కేసీఆర్ సర్కారు 2017లో గొల్ల కుర్మల సంక్షేమం కోసం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో గొలకుర్మలు ఎంతమంది ఉన్నారనే దానిపై సర్వేలు చేసింది. మొత్తం 4,404 మంది అర్హులను గుర్తించింది. మొదటి విడతలో 2,891 మందికి యూనిట్లు అందించింది. ఆపై రెండో విడతకు ఏర్పాట్లు చేయగా, కరోనా కారణాల వల్ల జాప్యమైంది. దీంతో విడతలో 1,513 మందికి ఇప్పటి వరకు గొర్రెల యూనిట్లు అందలేదు. పథకం విలువ రూ.1.75 లక్షలు కాగా, లబ్ధిదారులు రూ. 43,750 డీడీ రూపంలో చెల్లించాలి. మిగతా రూ.1,31,250లను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో కలిపి గొర్రెలను అందించాలి. ఒక యూనిట్‌లో 21 గొర్రెలు కాగా, వీటిలో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటుంది. రెండో విడుత గొర్రెలు వస్తాయని భావించిన 562 మంది లబ్ధిదారులు రూ. 43,750 చొప్పున డీడీలు కట్టారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 230 మందికి గొర్రెలను అందించింది. ఇక డీడీలు కట్టి రెండో విడుత గొర్రెల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు 332 మంది ఉన్నారు. వీరికి కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలను అందిస్తుందా.. లేదా అనేది సందిగ్ధంగా మారింది. ఇంకా జిల్లాలో అర్హులైన వారు 951 మంది డీడీ కట్టలేదు. రెండో విడుత గొర్రెల పంపిణీ సందిగ్ధంలో ఉండగా, మిగతా లబ్ధిదారులు డీడీలు కట్టేందుకు వెనుకాడుతున్నారు. రెండో విడుతలో డీడీలు కట్టిన 332 మందికి ఇంకా గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండడంతో వీరి గొర్రెల పథకం అమలవుతుందా లేదా అనేది సందేహంగా మారింది. గొర్రెల యూనిట్ల కోసం రెండో విడుతలో డీడీలు కట్టిన వారికి డబ్బులు తిరిగి ఇస్తారా.. లేక గొర్రెలు అందిస్తారా అనే అంశంపై స్పష్టత కరువైంది.



బెల్లంపల్లి సీవోఈలో సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

## సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

బెల్లంపల్లిరూరల్, మార్చి 10 : ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా ఆదివారం బెల్లంపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. బెల్లంపల్లి సీవోఈ బాలుర కళాశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 227 మంది విద్యార్థులకుగాను 215, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 231 మంది విద్యార్థులకుగాను 216 మంది హాజరయ్యారు. ఆదిలాబాద్ సీవోఈ బాలికల కళాశాలలో 6 వ తరగతిలో 116 మందికి 108, ఇంటర్మీడియట్‌లో 114 మందికి 110 మంది హాజరయ్యారు. ఆసిఫాబాద్ బాలుర కళాశాలలో 6వ తరగతిలో 95 మందికి 84, ఇంటర్మీడియట్‌లో 60 మందికి 48 మంది హాజరయ్యారు. బెల్లంపల్లి,ఆసిఫాబాద్ కేంద్రాల్లో ఆర్సీవో కే.స్వరూపారాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా ఐనాల సైదులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వరమని ప్రమోద్ కుమార్, రూట్ ఆఫీసర్‌గా దశరథరామ్ వ్యవహరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. బెల్లంపల్లిలో తాళ్లగురిజాల ఎస్ఐ జి.నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అభిజిత్‌కు భరోసా..

- 'నమస్తే' కథనానికి స్పందిస్తున్న దాతలు
- మున్నూరుకాపు ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేల అందజేత
- ఇప్పటి వరకు రూ.2.50 లక్షల సాయం




దండేపల్లి, మార్చి 10 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతాపూర్ గ్రామానికి చెందిన ఈర్ల అభిజిత్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా, ఈ నెల 3న 'నమస్తే తెలంగాణ'లో 'అభిజిత్‌ను బతికించరూ..' పేరిట కథనం ప్రచురించగా, దాతలు స్పందిస్తున్నారు. ఆదివారం మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభిజిత్ కుటుంబ సభ్యులకు రూ.20 వేల సాయమందించి భరోసానిచ్చారు. దాతల నుంచి ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు అందినట్లు అభిజిత్ తల్లిదండ్రులు ఈర్ల సతీశ్-మౌనిక తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి రాజన్న, పోలంపెల్లి శ్రీనివాస్, అప్పాల మనోహర్, కుంచె కిషన్, జాబు సుగుణాకర్, బొలిశెట్టి బుచ్చన్న, కళ్లెం రాజు, నల్లెల సంతోష్, రామరాజు, కొండు రామన్న, ముత్తినేని రమేశ్ ఉన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్దే వద్దు

- ఇప్పటికే ఎల్లంపల్లికి ఇచ్చాం ● ఉన్నవి కూడా లాక్కుంటే బతుకుడెట్లా ● పలు గ్రామాల ప్రజల ఆవేదన
- లక్ష్మీపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో



లక్ష్మీపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ప్రజలు

లక్షెట్టిపేట, మార్చి 10 : నిజామాబాద్ నుంచి క్యాతన్‌పల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు తమ భూమిలిచ్చేది లేదని లక్షెట్టిపేట, పోతపల్లి, ఇటిక్యాల, సూరారం, గుల్లకోట గ్రామాల ప్రజలు తెగేసి చెప్పారు. ఆదివారం భూ సర్వేకు వస్తున్నారని తెలిసి లక్ష్మీపూర్ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. గతంలో ఎల్లంపల్లిలో చేపట్టిన శ్రీపాదరావు ప్రాజెక్టు కోసం భూములిచ్చామని, ఇగ ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకొని బతుకుతుంటే.. అవ్వి కూడా లాక్కుంటే ఎలాగని కన్నీటి పర్యంతమయ్యారు. సాగు భూములను తీసుకునే బదులు ప్రస్తుతం ఉన్న రహదారినే విస్తరించాలని, గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్దే వద్దంటూ నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చే దాక ఆందోళన కొనసాగిస్తామని మొండికేశారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్ బాధితులతో మాట్లాడారు. ఈనెల 12న అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



బాధితులతో మాట్లాడుతున్న సీఐ నరేందర్

### ఎల్లంపల్లికి 14ఎకరాలు ఇచ్చినం



*ఎల్లంపల్లి నిర్మాణంలో 14 ఎకరాల భూమి ఇచ్చినం. ఇప్పుడు మళ్లా గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సర్వే చేస్తున్నరు. ఉన్న ఏడు ఎకరాల్లో ఐదు ఎకరాల భూమి పోతుంది. ఇంత భూమిని కేంద్రం తీసుకుంటే.. ఇగ మేమెట్లా బతకడం. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని వెడెల్పు చేస్తే నష్టమేమిటి. అసలు రైతుల భూములు లాక్కుంటే ఎట్లా. ఎట్టి పరిస్థితుల్లో మా భూములివ్వం.*

**- నాగిరెడ్డి రమా, సూరారం**

### బతుకుడెలా



*ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద సుమా రు16 ఎకరాలపైనే భూమి పోయింది. ఇప్పుడు మరో రెండు ఎకరాలు రోడ్డు కోసం తీసుకో వాలని చూస్తున్నరు. మేమంతా ఎవుసం మీదే ఆధారపడి బతుకుతున్నం. ఉన్న కాస్త భూమి తీసుకుంటే కుటుంబాన్ని పోషించుకునేది ఎలాగో ప్రభుత్వమే చెప్పాలి.*

**- గోపె అశోక్. లక్షెట్టిపేట**

### ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



*నాకు లక్షెట్టిపేట శివారులో నాలుగెకరాలు ఉంది. అందులో రెండున్నర ఎకరాలు రహదారికి పోతుందంటున్నరు. గీ భూమే మా కుటుంబానికి దిక్కు. ఇది కూడా తీసుకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ఇద్దరు బిడ్డలను ఎట్లా చదివించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.*

**- ఎంబడి రాజు. గోదావరి రోడ్డు, లక్షెట్టిపేట**